క్లుప్తంగా

విద్యుత్ సరఫరాలో నేడు అంతరాయం

గుంతకల్లు/టౌన్: పట్టణంలోని ఆలూరురోడ్, ఆదర్శనగర్, పారిశ్రామిక వాడల్లోని విద్యుత్ సబ్‌స్టేషన్‌ల పరిధిలో మరమ్మతుల, చెట్ల నరికివేత కారణంగా శనివారం ఉదయం 9 నుంచి మధ్యాహ్నం 2 గంటల వరకూ పట్టణంలో కరెంట్ సరఫరాను నిలిపివేయనున్నట్లు ట్రాన్స్‌కో డీఈ రంగస్వామి, ఏఈ రఘునాథ్‌లు శుక్రవారం ఓ ప్రకటనలో తెలిపారు. వినియోగదారులు సహకరించాలని వారు కోరారు.

పుట్లూరు/యల్లనూరు: పుట్లూరు మండలంలోని కోమటికుంట్ల 120 కేవీ సబ్‌స్టేషన్‌లో శనివారం మరమ్మత్తులు చేపడుతున్నట్లు ట్రాన్స్‌కో ఏడీ వసంతయ్య, ఏఈ విజయుడు శుక్రవారం ఓ ప్రకటనలో తెలిపారు. ఈ నేపథ్యంలో పుట్లూరు, యల్లనూరు మండలాల్లో ఉదయం 7 గంటల నుంచి మధ్యాహ్నం 12 గంటల వరకూ విద్యుత్ సరఫరాలో అంతరాయం ఏర్పడుతుందన్నారు. గృహ, వ్యవసాయ విద్యుత్ వినియోగదారులు సహకరించాలని వారు కోరారు.

వైఎస్సార్‌సీపీ నాయకురాలి మృతి


అశ్వ పెద్దక్క (ఫైల్)

గుత్తి: పట్టణంలోని జంగాల కాలనీకి చెందిన వైఎస్సార్‌సీపీ నాయకురాలు అశ్వ పెద్దక్క గురువారం రాత్రి ఆకస్మికంగా మృతి చెందారు. సమాచారం తెలుసుకున్న వైఎస్సార్ సీపీ బీసీ సెల్ జిల్లా అధ్యక్షుడు వీరన్న,మున్సిపల్ చైర్ పర్సన్ వన్నూర్‌బీ, పట్టణ కన్వీనర్ పీరా, జిల్లా నాయకులు అశ్వ మారెన్న, అశ్వ చిన్న మారెన్న, అశ్వనాగప్ప, మాజీ ఎంపీటీసీ సురేష్, కౌన్సిలర్ అశ్వ రాముడు, పట్టణ, మండల సచివాలయ కన్వీనర్లు రంగస్వామి, సుభాష్‌రెడ్డి, జిల్లా ఉపాధ్యక్షులు సీవీ రంగారెడ్డి, మధుసూదన్ రెడ్డి తదితరులు శుక్రవారం పెద్దక్క మృతదేహంపై పుష్పగుచ్ఛాలు ఉంచి నివాళులర్పించారు. వారు మాట్లాడుతూ పెద్దక్క మరణం పార్టీకి తీరని లోటన్నారు.

విద్యార్థులకు నగదు ప్రోత్సాహకం


విద్యార్థులకు నగదు అందజేస్తున్న పూర్వ విద్యార్థులు

పామిడి: పట్టణంలోని టీసీ హైస్కూల్‌లో శుక్రవారం 1981–82 బ్యాచ్ పదోతరగతి విద్యార్థులు 2023–24 సంవత్సర టెన్త్ ప్రతిభావంత విద్యార్థులను నగదు బహుమతితో ప్రోత్సహించారు. ఈసందర్భంగా పదిలో అత్యధిక మార్కులు సాధించిన అబ్దుల్ సుబహాన్‌కు మొదటి బహుమతిగా రూ.10 వేలు, రెండో బహుమతిగా రూ.7వేలు మణిదీప్‌కుమార్‌కు అందజేశారు. కార్యక్రమంలో పూర్వ విద్యార్థులు మోహన్, బాలాజీ, నరసింహులు, మైనుద్దీన్, జితేంద్ర, నాగేశ్వరరావు, కోకిలే భాస్కర్, ఎల్ఎస్ శ్రీనివాసులు, పత్రా శ్రీనివాసులు, హెచ్ఎం కే రామ్‌కుమార్, ఎన్‌సీసీ యూనిట్ అధికారి రామాంజనేయులు తదితరులు పాల్గొన్నారు.

నాణ్యమైన భోజనం అందించాలి


మాట్లాడుతున్న ఎమ్మెల్యే శ్రావణి

పుట్లూరు: విద్యార్థులకు నాణ్యమైన భోజనం అందించాలని శింగనమల ఎమ్మెల్యే శ్రావణి సూచించారు. శుక్రవారం ఆమె మండలకేంద్రంలోని అంగన్‌వాడీ కేంద్రం, భవిత కేంద్రం, ప్రాథమిక పాఠశాల, ఆదర్శ పాఠశాల వసతి గృహాలను ఆకస్మిక తనిఖీ చేశారు. ఈ సందర్భంగా అంగన్‌వాడీ కేంద్రం, భవిత కేంద్రంలో చిన్నారులతో ముచ్చటించారు. అనంతరం ఆదర్శ పాఠశాల వసతి గృహంలో విద్యార్థినుల కోసం వచ్చిన సరుకులు, కూరగాయల నాణ్యతను చూసి అసహనం వ్యక్తం చేశారు. కూరగాయాల్లో పురుగులు ఉన్నాయని ఇలాంటి సరుకులు సరఫరా చేసే వారిపై చర్యలు తీసుకుంటామన్నారు. కార్యక్రమంలో అధికారులు, టీడీపీ నాయకులు పాల్గొన్నారు.

బారే హిమామ్ పీర్లకు వెండి గొడుగు వితరణ


వెండి గొడుగు అందజేస్తున్న దాతలు

గుత్తి: పట్టణంలోని బారే హిమామ్ పీర్లకు శుక్రవారం గుత్తికి చెందిన సాయి ముకేష్ దంపతులు అర కిలో వెండి గొడుగును వితరణ చేశారు. దాతలు మాట్లాడుతూ ప్రతి ఏటా పీర్లకు మొక్కుబడులు చెల్లించడం ఆనవాయితీగా వస్తోందన్నారు. కార్యక్రమంలో కోనా ప్రదీప్ రెడ్డి, కోనా బాలప్ప, రవి కుమార్ తదితరులు పాల్గొన్నారు.

పంట మార్పిడితో అధిక దిగుబడులు

- రైతు సదస్సులో ప్రధాన శాస్త్రవేత్త డాక్టర్ విజయశంకర్‌బాబు


బుక్కరాయసముద్రం మండలం రేకులకుంటలో మాట్లాడుతున్న డాక్టర్ విజయ శంకర్‌బాబు

బుక్కరాయసముద్రం: రైతులు వాతావరణానికి అనుగుణంగా పంటలు సాగు చేయడంతోపాటు పంట మార్పిడి చేపట్టడం ద్వారా అధిక దిగుబడి సాధించవచ్చని ఆచార్య ఎన్జీరంగా వ్యవసాయ పరిశోధన కేంద్రం అధిపతి, ప్రధాన శాస్త్రవేత్త డాక్టర్ విజయ శంకర్ బాబు సూచించారు. శుక్రవారం మండలంలోని రేకులకుంటలో ఉన్న వ్యవసాయ పరిశోధన కేంద్రంలో గ్రామీణ వ్యవసాయ వాతావరణ సేవా పథకంలో భాగంగా రైతులకు వాతావరణ ఆధారిత రైతు సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా ప్రధాన శాస్త్రవేత్త మాట్లాడుతూ రైతులు తరచూ ఒకే పంటను సాగు చేయకుండా పంట మార్పిడి తప్పనిసరిగా చేపట్టాలన్నారు. పంటలు సాగు చేసే సమయంలో భూసార పరీక్షలు తప్పనిసరిగా చేయించు కోవాలన్నారు. వచ్చిన ఫలితాల ఆధారంగా ఎరువులు వాడాలన్నారు. మెట్ట వ్యవసాయ సేవలను రైతులు సక్రమంగా సద్వినియోగం చేసుకుని మంచి దిగుబడులు సాధించాలన్నారు. అనంతరం రైతులకు వాతావరణ ఆధారిత మార్పులపై సలహాలు, సూచనలిచ్చారు. కార్యక్రమంలో శాస్త్రవేత్తలు, రైతులు పాల్గొన్నారు.

75 శాతం సబ్సిడీతో పాడి రైతులకు గడ్డి విత్తనాలు

శింగనమల: పాడి రైతులకు 75 శాతం సబ్సిడీతో గడ్డి విత్తనాలను పంపిణీ చేస్తున్నట్లు శింగనమల వెటర్నరీ సహాయ సంచాలకుడు డాక్టర్. పద్మనాభం తెలిపారు. శుక్రవారం శింగనమలలోని సచివాలయం వద్ద పాడి రైతులకు గడ్డి విత్తనాలు పంపిణీ చేశారు. ఆయన మాట్లాడుతూ శింగనమలకు 0.5 మెట్రిక్ టన్నులు, సలకంచెరువు పశువైద్యశాలకు 1.5 మెట్రిక్ టన్నులు, తరిమెల వెటర్నరీ పశువైద్యశాలకు ఒక మెట్రిక్ టన్ను, గార్లదిన్నె పశువైద్యశాలకు 1.5 మెట్రిక్ టన్నులు, ఎర్రగుంట్ల పశువైద్యశాలకు 1 మెట్రిక్ టన్ను గడ్డి విత్తనాలు సరఫరా అయ్యాయన్నారు. గడ్డి విత్తనాలు పూర్తి ధర రూ.92 కాగా పాడి రైతు రూ.75 సబ్సిడీ పోను రూ.23 చెల్లించాలన్నారు. గడ్డి జాత రకం ఏక వార్షిక మల్టీకట్ వెరైటీనని, ఎకరాకు 10 కిలోలు చొప్పున చల్లుకోవాలన్నారు. నీటిపారుదల కింద అయితే 20 కిలోలు చల్లుకోవాలన్నారు. మొదటి కోత 70 రోజులకు, తరువాత 45 రోజులకు ఒక సారి మూడు నుంచి ఆరు సార్లు కోతకు వస్తుందన్నారు. ఎకరాకు దాదాపు 30 నుంచి 60 మెట్రిక్ టన్నుల పచ్చిగడ్డి దిగుబడి చేసుకోవచ్చన్నారు. పాడి రైతులు సద్వినియోగం చేసుకోవాలన్నారు.

వ్యవసాయ సిబ్బంది రైతులకు అందుబాటులో ఉండాలి

గుంతకల్లు రూరల్: ఖరీఫ్ పంటలు సాగు చేసిన రైతులకు వ్యవసాయ శాఖ సిబ్బంది నిరంతరం అందుబాటులో ఉంటూ సలహాలు, సూచనలను అందజేయాలని ఏడీఏ స్వాతి సూచించారు.శుక్రవారం స్థానిక మార్కెట్ యార్డులోని రైతు భరోసా కేంద్రంలో వ్యవసాయ శాఖ సిబ్బందితో ఆమె సమావేశం నిర్వహించారు. ప్రస్తుత ఖరీఫ్ సీజన్‌లో అమలు చేయనున్న సంక్షేమ పథకాలు, సాగు చేసిన పంటల వివరాలు, పంటల పరిస్థితులు, పంట తెగుళ్ల, వాటికి తీసుకోవాల్సినజాగ్రత్తలు తదితర వివరాలపై సిబ్బందికి అవగాహన కల్పించారు. అలాగే పంటనమోదు కార్యక్రమాన్ని కూడా సమర్థవంతంగా నిర్వహించాలని సూచించారు. కంది సాగు చేసే రైతులకు సబ్సిడీ విత్తనాలు అందజేస్తున్నామని, అవకాశాన్ని రైతులు సద్వినియోగం చేసుకోవాలని సూచించారు.

కౌలు రైతు కార్డులు పొందాలి

గార్లదిన్నె: కౌలు రైతులు తప్పనిసరిగా గుర్తింపు కార్డులు పొందాలని ఏఓ సోమశేఖర్ సూచించారు. శుక్రవారం ఏఓ మాట్లాడుతూ కౌలు రైతు గుర్తింపు కార్డు ఉన్న రైతులు పంట నష్టం, వ్యవసాయ, యాంత్రీకరణ పరికరాలు, రాయితీపై విత్తనాలు పొందవచ్చునన్నారు. అలాగే గత ఏడాది కౌలు గుర్తింపు కార్డులు ఉన్న రైతులు రెన్యూవల్ చేయించుకోవాలన్నారు. గుర్తింపు కార్డులు కావాల్సిన కౌలు రైతులు వీఆర్‌ఓలను సంప్రదించాలన్నారు.

కృత్రిమ గర్భధారణ పథకం సద్వినియోగం చేసుకోండి


రాచేపల్లిలో మాట్లాడుతున్న పశు గణాభివృద్ధి సంస్థ కార్యనిర్వహణ అధికారి సుధాకర్

శింగనమల: పశువులకు కృత్రిమ గర్భధారణ పథకాన్ని పాడి రైతులు సద్వినియోగం చేసుకోవాలని జిల్లా పశుగణాభివృద్ధి సంస్థ కార్యనిర్వహణ అధికారి, డిప్యూటీ డైరెక్టర్ సుధాకర్ సూచించారు. శుక్రవారం మండలంలోని రాచేపల్లిలో పాడి రైతులకు అవగాహన కార్యక్రమం నిర్వహించి, పశు వైద్య శిబిరం నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ 90 శాతం ఖచ్చితత్వంతో పేయి దూడలను పుట్టుకను లింగ నిర్ధారిత వీర్యంతో కృత్రిమ గర్భధారణ పథకం కింద మంచి పశువులను ఎన్నిక చేసుకోవడానికి గర్భకోశ చికిత్స శిబిరాలు ఏర్పాటు చేస్తున్నామన్నారు. రూ.1,350 విలువ కలిగిన రెండు సూదులను రూ.850 సబ్సిడీ పోనూ పాడి రైతులు రూ.500 చెల్లించాలన్నారు. ఈ సందర్భంగా 45 పశువులకు గర్భకోశ పరీక్షలు చేశారు. కార్యక్రమంలో శింగనమల వెటర్నరీ సహాయ సంచాలకుడు పద్మనాభం, వెటర్నరీ వైద్యులు కిరణ్‌కుమార్ రెడ్డి, మౌనప్రియ తదితరులు పాల్గొన్నారు.

19న మండల సమావేశం

గుత్తి రూరల్: పట్టణంలోని ఎంపీడీఓ కార్యాలయంలో ఈ నెల 19న మండల సర్వ సభ్య సమావేశం నిర్వహించనున్నట్లు ఎంపీడీఓ శ్రీనివాసులు, ఎంపీపీ గాండ్లపాటి విశాలాక్షి శుక్రవారం ఓ ప్రకటనలో పేర్కొన్నారు. ఉదయం 11 గంటలకు ప్రారంభమయ్యే సమావేశానికి సర్పంచులు ఎంపీటీసీలు, మండల కో-ఆప్షన్ సభ్యులు, జెడ్పీటీసీ, అధికారులు హాజరు కావాలన్నారు.

అంగన్‌వాడీ కేంద్రాల తనిఖీ

గుత్తి: పట్టణంలోని పలు అంగన్‌వాడీ కేంద్రాలను శుక్రవారం సీడీపీఓ ఢిల్లీశ్వరి, సూపర్ వైజర్ నాగేశ్వరి తనిఖీ చేశారు. ఈ సందర్భంగా వారు అంగన్‌వాడీ కేంద్రాల్లోని రికార్డులు పరిశీలించారు. పౌష్టికాహార పంపిణీపై ఆరా తీశారు. సమయపాలన పాటించాలని అంగన్‌వాడీ కార్యకర్తలను ఆదేశించారు.

ఎస్ఆర్ఐటీలో పేపర్ బ్యాగ్ డే


ప్రతిభ కనబరిచిన విద్యార్థులు

బుక్కరాయసముద్రం: మండలంలోని రోటరీపురంలో ఉన్న ఎస్ఆర్ఐటీ (అటానమస్) ఇంజినీరింగ్ కళాశాలలో శుక్రవారం ప్రపంచ పేపర్ బ్యాగ్ దినోత్సవం నిర్వహించారు. బీటెక్ విద్యార్థులు కాగితాలను ఉపయోగించి పేపర్ బ్యాగులను తయారు చేశారు. ఈ సందర్భంగా ప్రొఫెసర్ డాక్టర్ వినత మాట్లాడుతూ ప్లాస్టిక్ వాడకం వల్ల పర్యావరణం కాలుష్యం ఏర్పడుతోందన్నారు. అనంతరం నిర్వహించిన పోటీల్లో మొదటి బహుమతి ఎస్ఎస్ వలి, ద్వితీయ బహుమతి అక్షయ, తృతీయ బహుమతిగా చక్రధర్ గెలుపొందారు. కార్యక్రమంలో ప్రిన్సిపాల్ డాక్టర్ బాలక్రిష్ణ, బీసీడీఈ కోఆర్డినేటర్ కవిన్ కుమార్, ఎన్‌డీఎల్ఐ క్లబ్ ప్రసిడెంట్ డాక్టర్ లక్ష్మీ, విద్యార్థులు పాల్గొన్నారు.

బియ్యం ప్యాకెట్ల వితరణ

పామిడి: పెన్నానదిలోని షిర్డి సాయిబాబా ఆశ్రమానికి శుక్రవారం ఏడీసీసీ బ్యాంకు మాజీ చైర్మన్ ఎం. వీరాంజనేయులు 5 ప్యాకెట్ల బియ్యం వితరణ చేశారు. బియ్యం ప్యాకెట్లను ఆశ్రమ వ్యవస్థాపకుడు, పీఠాధిపతి సనారి వీరయ్యస్వామికి అందజేశారు. ఈ నెల 21న గురుపౌర్ణమి రోజు అన్నదాన కార్యక్రమానికి బియ్యం ప్యాకెట్లు వితరణగా ఇచ్చినట్లు వీరాంజనేయులు తెలిపారు.

ఘనంగా 'ఆషాఢ' ఉత్సవాలు


కన్యకాపరమేశ్వరి మాతను పూజిస్తున్న వాసవీ మాతృమండలి మహిళా సభ్యులు

పామిడి: పట్టణంలోని కన్యకా పరమేశ్వరి మాత, పసుపు కుంకుమల ముత్యాలమ్మ తదితర ఆలయాల్లో వాసవీ మాతృమండలి, పూజారి కుళ్లాయప్ప ఆధ్వర్యంలో ఆషాఢమాస తొలి శుక్రవారం పురస్కరించుకుని వేర్వేరుగా ప్రత్యేక పూజలు చేశారు. ఈసందర్భంగా స్థానిక కన్యకా పరమేశ్వరీ మాతకు మాతృమండలి ఆధ్వర్యంలో అభిషేక, అలంకరణ గావించారు. వాసవీ సహస్రనామ పూజ, సుగంధ జాజి, మల్లెపూలతో పూజలు చేశారు. లలిత అష్టోత్తర శత నామావళి, కుంకుమార్చన గావించారు. అలాగే నెహ్రూకాలనీలోని పసుపు కుంకుమల ముత్యాలమ్మ ఆలయంలో పూజారి కుళ్లాయప్ప ఆధ్వర్యంలో భక్తుల సౌజన్యంతో చేయించిన రూ.1.30 లక్షలతో చేయించిన నూతన వెండి ముఖాన్ని మూలవిరాట్‌కు ఆవిష్కరించారు. అనంతరం భక్తులకు అన్నదానం చేశారు. కార్యక్రమాల్లో రాజేశ్వరి, వసంత, అనుపమ, కవిత, మాధవి, శ్రీవల్లి, లత, నారాయణమూర్తి, నాగభూషణం తదితరులు పాల్గొన్నారు.

వెంగమనాయుడుకు ఘన నివాళి


గుంతకల్లులో నివాళులర్పిస్తున్న సీపీఐ నాయకులు

గుంతకల్లు రూరల్/తాడిపత్రి రూరల్/గుత్తి: వెంగమనాయుడు వర్ధంతిని పురస్కరించుకుని సీపీఐ నాయకులు ఘనంగా నివాళులర్పించారు. శుక్రవారం గుంతకల్లులోని సీపీఐ కార్యాలయంలో వర్ధంతి కార్యక్రమం నిర్వహించారు. కార్యక్రమంలో సీపీఐ జిల్లా కార్యదర్శి గోవిందు, నియోజకవర్గ కార్యదర్శి వీరభద్రస్వామి తదితరులు పాల్గొన్నారు. అలాగే తాడిపత్రి పట్టణ సమీపంలోని రంగప్ప కాలనీలో వెంగమనాయుడు వర్ధంతి కార్యక్రమం నిర్వహించారు. సీపీఐ వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా అధ్యక్షుడు రంగయ్య, కౌలు రైతు సంఘం జిల్లా అధ్యక్షుడు రామాంజినేయులు, నియోజక వర్గ అధ్యక్షుడు నారాయణరెడ్డి, మండల కార్యదర్శి నాగరంగయ్య తదితరులు పాల్గొన్నారు. గుత్తి పట్టణంలోని సీపీఐ కార్యాలయంలో నిర్వహించిన వెంగమ నాయుడు వర్ధంతి కార్యక్రమంలో సీపీఐ పట్టణ కార్యదర్శి రామదాసు తదితరులు పాల్గొన్నారు.

సీజనల్ వ్యాధులపై జాగ్రత్తగా ఉండాలి


యాడికి మండలం చింతలాయపల్లెలో ర్యాలీ నిర్వహిస్తున్న దృశ్యం

గుత్తి: సీజనల్ వ్యాధుల పట్ల జాగ్రత్తగా ఉండాలని మున్సిపల్ కమిషనర్ శ్రీనివాసులు సూచించారు. పట్టణంలోని పలు వార్డుల్లో శుక్రవారం ఆయన పర్యటించారు. ఆయన మాట్లాడుతూ సీజనల్ వ్యాధులపై అప్రమత్తంగా ఉండాలని ప్రజలకు సూచించారు. దోమల నిర్మూలనకు చర్యలు తీసుకోవాలన్నారు. వ్యక్తిగత పరిశుభ్రతతో పాటు పరిసరాల పరిశుభ్రత పాటించాలన్నారు.

గుత్తి రూరల్: ప్రతి ఒక్కరూ పరిసరాల పరిశుభ్రత తప్పకుండా పాటించాలని ఎంపీడీఓ శ్రీనివాసులు, ఈఓఆర్డీ శివాజీరెడ్డి సూచించారు. మండలంలోని అబ్బేదొడ్డి గ్రామంలో శుక్రవారం ఫ్రైడే...డ్రై డే కార్యక్రమం నిర్వహించారు. గ్రామంలో ఇంటింటికి వెళ్లి పరిసరాల పరిశుభ్రతపై ప్రజలకు అవగాహన కల్పించారు. ప్రస్తుతం డయేరియా వ్యాధి విస్తరిస్తోందని, ప్రజలు జాగ్రత్తలు తీసుకోవాలని సూచించారు. కార్యక్రమంలో వైద్య, సచివాలయ సిబ్బంది పాల్గొన్నారు.

యాడికి: సీజనల్ వ్యాధులు ప్రబలకుండా ప్రజలు అప్రమత్తంగా ఉండాలని తాడిపత్రి మలేరియా సబ్ యూనిట్ అధికారి శ్రీనివాసులు సూచించారు. మండలంలోని చింతలాయపల్లెలో శుక్రవారం డెంగీ, మలేరియా వ్యతిరేక మాసోత్సవాల్లో భాగంగా నిర్వహించిన కార్యక్రమంలో ఆయన పాల్గొన్నారు. ఆయన మాట్లాడుతూ మురుగు కాల్వలు, గుంతలు, పాత టైర్లు, కుండల్లో నీటి నిల్వలు ఉండకుండా చూడాలన్నారు. కార్యక్రమంలో ఏఎన్ఎం జీనత్, ఎంఎల్‌హెచ్‌పీ భాగ్యలక్ష్మి, ఆశా కార్య కర్త రంగమ్మ పాల్గొన్నారు.

విద్యుత్ నిలయం ప్రారంభం


విద్యుత్ నిలయాన్ని ప్రారంభిస్తున్న ఎంపీ

గుంతకల్లు/టౌన్: పట్టణంలోని ఆలూరు రోడ్డు వద్ద రూ.2.25 కోట్లతో నిర్మించిన విద్యుత్ నిలయాన్ని ఎంపీ అంబికా లక్ష్మీనారాయణ, మున్సిపల్ చైర్‌పర్సన్ ఎన్.భవాని ప్రారంభించారు. శుక్రవారం జరిగిన ప్రారంభోత్సవ కార్యక్రమంలో విద్యుత్ శాఖ జిల్లా ఎస్ఈ సురేంద్ర మాట్లాడుతూ నిరంతరాయంగా విద్యుత్‌ను సరఫరా చేయడంతో పాటు వినియోగదారులకు మెరుగైన సేవలందించడమే ఏపీఎస్పీడీసీఎల్ ధ్యేయమన్నారు. కార్యక్రమంలో ట్రాన్స్‌కో గుత్తి ఈఈ రాజశేఖర్, డీఈ రంగస్వామి, స్థానిక ఎమ్మెల్యే సోదరుడు నారాయణస్వామి, ఏఈలు రఘునాథ్, రవిచంద్ర, అబ్దుల్ మన్నన్, షేక్షావలి, తదితరులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా పట్టణంలోని రోటరీ క్లబ్-ఎస్‌జేపీ హైస్కూల్ సమీపంలో ఫుట్ ఓవర్ బ్రిడ్జి (ఎఫ్ఓబీ) నిర్మాణానికి కృషి చేయాలని ఎంపీకి హెచ్ఎం భూపాల్‌రెడ్డి, మాజీ కౌన్సిలర్ రామాంజనేయులు, కాలనీ వాసులు వినతి పత్రం అందజేశారు.

ట్రిపుల్ ఐటికీ ఎంపిక


ఐ.కావ్య


సుమనశ్రీ


చందన

శింగనమల/గార్లదిన్నె: శింగనమల మండలంలోని ఈస్ట్ నరసాపురం ఎంజేపీ గురుకుల బాలికల పాఠశాల విద్యార్థినులు ముగ్గురు ట్రిపుల్ ఐటీకి ఎంపికైనట్లు ప్రిన్సిపాల్ సంగీతకుమారి శుక్రవారం తెలిపారు. విద్యార్థిని ఐ.కావ్య నూజివీడు, సుమనశ్రీ, చందన ఇడుపులపాయ ట్రిపుల్ ఐటీకీ ఎంపిక య్యారు. అలాగే గార్లదిన్నె మండలంలోని బూదేడుకు చెందిన హేమశ్రీ అనే విద్యార్థిని ఇడుపుల ట్రిపుల్ ఐటీకి ఎంపికైంది. విద్యార్థినులను ఉపాధ్యాయులు, గ్రామస్తులు అభినందించారు.

మద్యం దుకాణాల్లో తనిఖీలు

యాడికి: మండల కేంద్రంతో పాటు రాయలచెరువులోని మద్యం దుకాణాల్లో ఎక్సైజ్ ఎస్ఐ ఖాజా, సిబ్బంది శుక్రవారం ఆకస్మిక తనిఖీలు చేపట్టారు. ఈ సందర్భంగా రూ.65,520 విలువ చేసే 42 బాక్సుల్లోని కాలం చెల్లిన బ్రీజర్ మద్యాన్ని స్వాధీనం చేసుకున్నారు.

ఆర్‌పీఎఫ్ పోలీసుల బదిలీ

తాడిపత్రి రూరల్: స్థానిక రైల్వే స్టేషన్‌లో పని చేస్తున్న ముగ్గురు ఆర్‌పీఎఫ్ పోలీసులను గుంతకల్లుకు బదిలీ చేశారు. వారం రోజుల క్రితం సాక్షిలో వచ్చిన దొంగతనాల కథనంపై అధికారులు స్పందించారు. విధుల పట్ల నిర్లక్ష్యంగా వ్యవహరిస్తున్న ముగ్గురు కానిస్టేబుళ్లను గుంతకల్లుకు బదిలీ చేశారు. వారి స్థానంలో మరో ముగ్గురిని తాడిపత్రికి బదిలీ చేశారు.

విద్యార్థులకు నాణ్యమైన భోజనం అందించాలి

గార్లదిన్నె: ప్రభుత్వ పాఠశాలలో చదివే విద్యార్థులకు రోజూ నాణ్యమైన భోజనం అందించాలని మండల స్పెషల్ ఆఫీసర్, మత్స్యశాఖ డీడీ శ్రీనివాసులనాయక్ సూచించారు. శుక్రవారం మండల కేంద్రంలోని జిల్లా పరిషత్ హైస్కూల్లో మధ్యాహ్న భోజన పథకాన్ని ఆయన పరిశీలించారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ పాఠశాలలో మెనూ ప్రకారం రోజూ విద్యార్థులకు నాణ్యమైన భోజనం అందించాలన్నారు. అలాగే కోడింగ్ పరిశీలించి నాణ్యమైన కోడి గుడ్లు తీసుకోవాలన్నారు. విద్యార్థులకు అందించే చిక్కీలు కూడా నాణ్యంగా ఉండాలన్నారు. కార్యక్రమంలో ఇన్‌చార్జ్ ఎంపీడీఓ వెంకటలక్ష్మి, పంచాయతీ కార్యదర్శి రవిచంద్ర, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

నెట్టికంటుడి గర్భాలయానికి వెండి నగిషీ

గుంతకల్లు రూరల్: కసాపురంలోని నెట్టికంటి ఆంజనేయస్వామి దేవస్థానంలో ఎమ్మెల్యే గుమ్మనూరు జయరాం సౌజన్యంతో శుక్రవారం గర్భాలయ గడపకు రూ.2.6 లక్షలతో వెండి నగిషీ రేకును ఏర్పాటు చేశారు. ఈసందర్భంగా ఎమ్మెల్యే గుమ్మనూరు జయరాం సోదరుడు శ్రీనివాసులు, ఎమ్మెల్యే కుమారుడు ఈశ్వర్ ఇతర కుటుంబ సభ్యుల ఆధ్వర్యంలో నూతనంగా ఏర్పాటు చేసిన వెండి గడపకు పూజలు నిర్వహించారు.

గోరింటాకు అలంకరణలో వాసవీమాత



యాడికి: మండల కేంద్రంలోని వాసవీ కన్యకా పరమేశ్వరీ ఆలయంలో ఆషాఢ మాసం మొదటి శుక్రవారం సందర్భంగా గోరింటాకు అలంకరణలో వాసవీ కన్యకా పరమేశ్వరీ అమ్మవారు భక్తులకు దర్శనమిచ్చారు. ఉదయం అమ్మవారికి సుప్రభాత సేవ, గంగా జలాలతో అభిషేకం, పంచామృతాభిషేకం, కుంకుమార్చన, లలిత సహస్ర నామావళి పఠించారు. హాజరైన భక్తులకు ఆలయ కమిటీ సభ్యులు తీర్థ ప్రసాదాలు అందజేశారు. కార్య క్రమంలో ఆర్యవైశ్య సంఘం సభ్యులు, మహిళలు పాల్గొన్నారు.

గూగూడులో ఘర్షణ

నార్పల: మద్యం మత్తులో ఒకరిపై మరొకరు దాడి చేసుకున్న ఘటన మండలంలోని గూగూడు గ్రామంలో శుక్రవారం చోటుచేసుకుంది. వివరాలు.. గూగూడు బ్రహ్మోత్సవాలకు శుక్రవారం వేర్వేరు ప్రాంతాలకు చెందిన నాగరాజు, శ్రీకాంత్ వచ్చారు. కుళ్లాయిస్వామి దర్శనం అనంతరం వారు మద్యం సేవించారు. మద్యం మత్తులో శ్రీకాంత్ బీర్ బాటిల్‌తో దాడి చేయగా నాగరాజు తలకు బలమైన గాయాలయ్యాయి. స్థానికులు నాగరాజును 108 వాహనంలో ప్రభుత్వ వైద్యశాలకు తరలించారు. నాగరాజు స్వగ్రామం బెంగళూరు కాగా శ్రీకాంత్ ధర్మవరానికి చెందిన వ్యక్తి. పోలీసులు వారిని అదుపులోకి తీసుకుని కేసు దర్యాప్తు చేస్తున్నారు.

పచ్చని చెట్లు ప్రగతికి మెట్లు


మొక్క నాటుతున్న గుత్తి మున్సిపల్ కమిషనర్ శ్రీనివాసులు

తాడిపత్రి అర్బన్: పచ్చని చెట్లు ప్రగతికి మెట్లు అని ఐసీడీఎస్ సూపర్‌వైజర్ దస్తగిరమ్మ అన్నారు. జిల్లాను హరిత అనంతగా తీర్చిదిద్దాలన్న కలెక్టర్ వినోద్‌కుమార్ ఆదేశాల మేరకు శుక్రవారం స్థానిక రమణమహర్షి ఆశ్రమ ఆవరణలో ఐసీడీసీఎస్ ఆధ్వర్యంలో మొక్కలు నాటే కార్యక్రమాన్ని నిర్వహించారు. ఆమె మాట్లాడుతూ మొక్కలు నాటడంతో పాటు వాటిని రక్షించుకునే బాధ్యత తీసుకోవాలన్నారు. ప్రజలందరూ సహకరించి గ్రామాలు, ఖాళీ ప్రదేశాలు, పొలాల వద్ద విరివిగా మొక్కలు నాటి పెంచాలన్నారు. చెట్లను నరకడం వల్ల వాతావరణంలో సమతుల్యత దెబ్బతింటుందన్నారు. కార్యక్రమంలో అంబేద్కర్ నగర్ సెక్టార్ అంగన్వాడీ కేంద్రాలకు సంబంధించిన అంగన్‌వాడీ కార్యకర్తలు పాల్గొన్నారు.

గుత్తి: పట్టణంలోని మున్సిపాలిటీ పరిసరాల్లో శుక్రవారం హరిత అనంత ప్లాంటేషన్ కార్యక్రమంలో భాగంగా మున్సిపల్ కమిషనర్ శ్రీనివాసులు ఆధ్వర్యంలో సిబ్బంది మొక్కలు నాటారు. కమిషనర్ మాట్లాడుతూ మొక్కలు నాటి సంరక్షించాలన్నారు. చెట్లు అధికంగా ఉంటే వర్షాలు సమృద్ధిగా కురుస్తాయన్నారు. ప్రతి ఒక్కరూ మొక్కలు నాటి సంరక్షించాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో టీపీబీఓ అప్పస్వామి , మున్సిపల్ సిబ్బంది పాల్గొన్నారు.

మొహర్రం ప్రశాంతంగా నిర్వహించుకోండి


తాడిపత్రిలో ముస్లిం మైనార్టీలతో సమావేశమైన అర్బన్ సీఐ నాగేంద్రప్రసాద్


యల్లనూరు పోలీస్‌స్టేషన్ వద్ద మాట్లాడుతున్న డీఎస్పీ వెంకటశివారెడ్డి

పుట్లూరు/యల్లనూరు: మొహర్రం వేడుకలను గ్రామాల్లో ప్రశాంతంగా జరుపుకోవాలని డీఎస్పీ వెంకటశివారెడ్డి సూచించారు. శుక్రవారం ఆయన పుట్లూరు, యల్లనూరు మండలాల్లో మొహర్రం వేడుకల సందర్భంగా కమిటీ సభ్యులు, గ్రామ పెద్దలతో సమావేశం నిర్వహించారు. మొహర్రం సందర్భంగా వివాదాలు లేకుండా జాగ్రత్తలు తీసుకోవాలని కమిటీ సభ్యులకు సూచించారు. కార్యక్రమంలో సీఐ సుబ్రమణ్యం, ఎస్ఐ హేమాద్రి పాల్గొన్నారు.

తాడిపత్రి అర్బన్: మొహర్రం వేడుకలను ప్రశాంత వాతావరణంలో నిర్వహించుకోవాలని అర్బన్ సీఐ నాగేంద్ర ప్రసాద్ కోరారు. శుక్రవారం అర్బన్ పోలీస్ స్టేషన్‌లోని కాన్ఫరెన్స్ హాలులో ముస్లింలతో సమావేశం నిర్వహించారు. సీఐ మాట్లాడుతూ కులమతాలకు అతీతంగా మొహర్రం వేడుకలను నిర్వహించుకోవాలని సూచించారు. అవాంఛనీయ సంఘటనలు చోటు చేసుకోకుండా నిర్వాహకులు చర్యలు తీసుకోవాలన్నారు. ఉత్సవాల పేరుతో శాంతిభద్రతలకు విఘాతం కల్గిస్తే ఎంతటివారైన ఉపేక్షించబోమని హెచ్చరించారు.

అనుమతి తప్పనిసరి

పెద్దవడుగూరు: మండలంలో మొహర్రం నిర్వహించే వారు పోలీసుల అనుమతులు తప్పనిసరిగా తీసుకోవాలని శుక్రవారం ఎస్ఐ చిన్నరెడ్డప్ప సూచించారు. మండలంలోని దిమ్మగుడి, చిన్నవడుగూరు, అప్పేచర్ల, క్రిష్టిపాడు తదితర ఫ్యాక్షన్ గ్రామాల్లో ఆయన పర్యటించారు. మొహర్రం సందర్భంగా ఎవరైనా శాంతిభద్రతలకు భంగం కలిగిస్తే కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు.

మొహర్రం ప్రారంభం

గార్లదిన్నె: మండల వ్యాప్తంగా పలు గ్రామాల్లో శుక్రవారం మొహర్రం వేడుకలు ప్రారంభమయ్యాయి. ఈ సందర్భంగా ఆయా గ్రామాల్లో పీర్ల అగ్ని గుండం ఏర్పాటు చేశారు. అలాగే పీర్ల స్వాములు ఉన్న పెట్టెను గ్రామాల్లో ఊరేగించి, చావిడిలో పీర్లను కొలువుదీర్చారు. భక్తులు పీర్లకు చక్కెర చదివించి మొక్కులు తీర్చుకున్నారు.